# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 25, నవంబరు, 2014

హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, ముస్లింల ప్రార్థనా మందిరాలు, ప్రజల మనోభావాలతో ముడిపడిన చిహ్నాలకు ఏలాంటి విఘాతం కలుగకుండానే మెట్రో రైలు ప్రాజెక్టును పూర్తి చేయడం ప్రభుత్వ ఉద్దేశ్యమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పునరుద్ఘాటించారు.

మెట్రో రైలు ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పులకు సంబంధించిన సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. ఇటీవలే ఎల్ అండ్ టి చైర్మన్ ఎ.ఎం. నాయక్ ముఖ్యమంత్రితో సమావేశమయిన సందర్భంగా అలైన్‌మెంట్ మార్పుల చర్చ జరిగింది. దీనికి ఎల్ అండ్ టి అంగీకరించిన నేపథ్యంలో అధికారికంగా మార్పులు సూచించడం కోసం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మెట్రో ప్రాజెక్టు ఎండి.ఎన్‌విఎస్.రెడ్డి, మెట్రో రైలు ప్రాజెక్టు సిఇ జియావుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ఎంఐఎం శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఈ సందర్భంగా పాత బస్తిలో అలైన్‌మెంట్ మార్పులకు సంబంధించి ప్రతిపాదనలతో కూడిన లేఖను ముఖ్యమంత్రికి అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం మొదట్లో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌లో మూడు మార్పులు సూచించామని వెల్లడించారు. అసెంబ్లీ, అమరవీరుల స్థూపం పవిత్రతలను కాపాడేందుకు అసెంబ్లీ వెనుక భాగం నుండి మెట్రో రైలు రూట్ మారాలని చెప్పారు. సుల్తాన్ బజార్ వద్ద కూడా మార్పును కోరుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్‌కు బదులు బడిచౌడి నుండి ఉమెన్స్ కాలేజ్ వెనుక భాగం ద్వారా ఇమ్లిబన్‌కు చేరే విధంగా కొత్త రూటు ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పాతబస్తిలో ప్రస్తుతం ఉన్న

అలైన్‌మెంట్ ప్రకారం ప్రాజెక్టు నిర్మాణం జరిగితే 7 హిందూ దేవాలయాలు, 28 ముస్లిం ప్రార్ధనా మందిరాలు, 1000 నివాస గృహాలు దెబ్బతింటాయని ముఖ్యమంత్రి అన్నారు. వీటి వల్ల ప్రభావితం అయ్యే అక్కన్న మాదన్న దేవాలయం, జగదీష్ టెంపుల్, బంగారు మైసమ్మ గుడి, లక్ష్మీ నర్సింహ దేవాలయం, ఆజాఖానా జోహ్రా, ఆసుర్ ఖానా నాల్ ముబారక్, ఇత్తెబార్ చౌక్ మసీదు, కోట్లా మసీదు తదితర ప్రాంతాలు ఉన్నాయన్నారు. వీటికి ఇబ్బంది కలుగకుండా కొత్త రూట్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం అధికారికంగా బుధవారం ఎల్ అండ్ టి కంపెనీకి అందించనుంది.

---

సిపిఆర్ఓ టు సిఎం